క్లుప్తంగా

నేడు కానూరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: కానూరు జేఆర్‌డీ టాటా ఎస్టేట్, మురళీనగర్ ఫీడర్ పరిధిలో మరమ్మతులు కారణంగా బుధవారం ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జేఆర్‌డీ టాటా ఎస్టేట్, మురళీనగర్, చక్కా నాగేశ్వరరావు రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని స్థానికులు సహకరించాలని ఆయన కోరారు.

అభయాంజనేయ సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని పూజలు చేశారు. అభయాంజనేయుడికి తమలపాకులతో పూజలు వైభవంగా జరిగాయి. అనంతరం ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు ప్రవాసాంధ్రుడు మేకా రవీంద్రరాధ కుటుంబ సభ్యులు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో ప్రజారోగ్య సంరక్షణ



కంకిపాడు: ఆరోగ్య సురక్షతో ప్రజారోగ్య సంరక్షణ జరుగుతుందని ఉప్పలూరు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ చంద్రిక అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు గ్రామంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం జరిగింది. శిబిరంలో కంటి వైద్య పరీక్షలు, సాధారణ పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ లలిత, డాక్టర్ రాజా, డాక్టర్ రాజేష్‌కుమార్ రోగులకు వైద్య సేవలు అందించారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ కృష్ణారావు, శ్రీనివాసరావు, ఏఎన్ఎం అనిత, ఆశ కార్యకర్తలు ఐఎస్‌బీఎస్ కుమారి, స్వర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఈడుపుగల్లులో ఇఫ్తార్ విందు



కంకిపాడు: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఈడుపుగల్లు గ్రామంలోని మసీదులో సోమవారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తనయులు రాజీవ్, రోహిత్ హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందు స్వీకరించి, ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మసీదు కమిటీ ప్రతినిధులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

అంబాపురంలో టీడీపీ స్టిక్కర్లతో వాటర్ ట్యాంకర్



అంబాపురం(విజయవాడరూరల్): ఎన్నికల నిబంధనలను అతిక్రమించి విజయవాడ రూరల్ మండలం అంబాపురం గ్రామంలో టీడీపీ నాయకులు పార్టీ స్టిక్కర్లతో ఉన్న వాటర్ ట్యాంకర్‌ను నడుపుతున్నారు. గన్నవరం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావ్, గ్రామ సర్పంచి గండికోట సీతయ్య స్టిక్కర్లున్న వాటర్ ట్యాంకర్‌తో గ్రామ ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తున్నామనే వంకతో పార్టీ ప్రచారం చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎంసీసీ అధికారులు ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే ప్రభుత్వ సంస్థలు నిర్వీర్యం

గన్నవరం: కేంద్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తుందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ముజఫర్‌అహ్మద్ పేర్కొన్నారు. స్థానిక అట్లూరి శ్రీమన్నారాయణ మీటింగ్ హాలులో మంగళవారం సీఐటీయూ డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అహ్మద్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన పదేళ్లల్లో ఎయిర్‌పోర్ట్స్, టెలికాం వంటి సంస్థలను ప్రైవేట్ పరం చేసిందన్నారు. విద్యుత్ రంగంలో కూడా సంస్కరణలు తీసుకువచ్చి ఒకటికి ఏడు రెట్లు కరెంట్ చార్జీలు పెరిగే పరిస్థితి తీసుకువచ్చిందన్నారు. ఈ పరిస్థితుల్లో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే దేశం ప్రమాదంలో పడుతుందని వివరించారు. దేశాన్ని పరిరక్షించుకునేందుకు బీజేపీ కూటమి పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. యూనియన్ నాయకులు మాదల వెంకటేశ్వరరావు, కళ్లం వెంకటేశ్వరరావు, బేత శ్రీనివాసరావు, కడవకొల్లు రామరాజు పాల్గొన్నారు.

ధాన్యం.. ధనం.. ఆనందం

రైతులకు తీపి కబురు చెప్పిన ప్రభుత్వం

- ధాన్యం సేకరణ పెండింగ్ బకాయిలు విడుదల
- కృష్ణా జిల్లా రైతుల ఖాతాలకు రూ. 355.40 కోట్లు
- తీరిన అన్నదాతల బెంగ
- ప్రభుత్వ చర్యతో రైతుల్లో హర్షాతిరేకాలు



ధాన్యం మూటలు కదుతున్న కూలీలు (ఫైల్)

కంకిపాడు: అన్నదాతలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. నిన్నటి వరకూ ధాన్యం సేకరణ సొమ్ము ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన రైతుల బెంగ తీరింది. అన్నదాతలకు ప్రభుత్వం అండగా నిలుస్తూ పెండింగ్ బకాయిలు విడుదల చేసింది. దీంతో ధాన్యం విక్రయించిన రైతు ఖాతాలకు సొమ్ము జమకానుంది. అధికార యంత్రాంగం రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేసే పనిలో నిమగ్నమైంది.

కృష్ణాజిల్లాలో 4.89 లక్షల టన్నులు సేకరణ..

ఖరీఫ్ సీజన్‌లో రైతు పండించిన పంటను సేకరించి మద్దతు ధర అందించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంది. రైతుభరోసా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ ప్రక్రియను చేపట్టి దళారీ వ్యవస్థకు చెక్ పెట్టింది. పారదర్శకంగా ధాన్యం సేకరణ చేపట్టింది. కృష్ణాజిల్లా వ్యాప్తంగా 25 మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో 3,69,116 ఎకరాల్లో వరి సాగు చేశారు. 10.52 లక్షల టన్నులు ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా. గతేడాది నవంబర్ 16 నుంచి జిల్లాలో ఉన్న 317 రైతుభరోసా కేంద్రాల్లో రైతులు/కౌలురైతుల నుంచి ధాన్యం సేకరణ చేపట్టారు. 55,671 మంది రైతుల నుంచి రూ. 1068.90 కోట్లు విలువైన 4.89 లక్షల టన్నుల ధాన్యం సేకరించారు. ఏ గ్రేడ్‌కు క్వింటాకు రూ. 2,203, కామన్ వెరైటీ వంగడాలకు రూ. 2,183 చొప్పున చెల్లింపులు చేశారు. ఇది వరకే 38,592 మంది రైతులకు రూ. 713.50 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు.

ఒకే రోజు రూ. 355.40 కోట్లు విడుదల..

ధాన్యం సేకరణకు సంబంధించి జిల్లాకు రూ. 355.40 కోట్లు పెండింగ్ ఉంది. ఈ మొత్తం సొమ్ము మంగళవారం విడుదలైంది. జిల్లాలో ఉన్న 17,079 మందికి ఈ సొమ్ము రైతుభరోసా కేంద్రాల్లో నమోదైన వివరాల ఆధారంగా జమ కానుంది. ఇప్పటి వరకూ ఖరీఫ్ సీజన్‌లో సేకరించిన ధాన్యంకు సంబంధించిన మొత్తం సొమ్ము రూపాయితో సహా చెల్లించినట్టే.

మద్దతు ఇస్తూ.. ఆపదలో ధైర్యం చెబుతూ..

రైతు పండించిన పంటకు మద్దతు ధర దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గత ప్రభుత్వ హయాంలో దళారులు అడ్డగోలుగా రైతుల నుంచి ధాన్యం సేకరించి మద్దతు ధర దక్కకుండా చేయటంతో రైతు కష్టం దళారుల పాలైంది. మద్దతు కోసం అనేక మార్లు అన్నదాతలు రోడ్డెక్కిన పరిస్థితి. రైతు కష్టాన్ని టీడీపీ హయాంలో చంద్రబాబు పట్టించుకున్న పాపాన పోలేదు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రైతుభరోసా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ ప్రక్రియ సాగేలా మార్గదర్శకాలు జారీ అయ్యాయి. దళారులకు ఆస్కారం లేకుండా, మిల్లర్ల దోపిడీకి గురికాకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ రైతుకి మద్దతు ధర కల్పించింది. గతేడాది డిసెంబర్‌లో మిచాంగ్ తుపానుతో కల్లాల్లో ఉన్న ధాన్యం తడిచింది. పంట నేలవాలి రైతుకు నష్టం వచ్చింది. కానీ కల్లాల్లో ఉన్న ధాన్యం తడిచినా/దెబ్బతిన్నా/రంగు మారినా రైతుల నుంచి కొనుగోలు చేసేలా నిబంధనలను సైతం సడలించింది. ఆపద సమయంలో అండగా నిలిచి ధాన్యం సేకరణను సమర్థంగా నిర్వహించింది.

రైతుల ఖాతాల్లో నగదు జమ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించిన ధాన్యానికి సంబంధించి చెల్లించాల్సిన నగదు రైతుల ఖాతాల్లో మంగళవారం జమయినట్లు జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ తోట వెంకటసతీష్ తెలిపారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 4,89,007.46 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 55,671 మంది రైతుల వద్ద నుంచి రూ. 1068.90 కోట్ల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. గతంలో 38,592 మంది రైతులకు రూ. 713.50 కోట్లు సంబంధిత రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ఇంకా చెల్లించాల్సి ఉన్న 17,079 మంది రైతుల ఖాతాల్లో రూ. 355.40 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో మంగళవారం జమ చేసినట్లు ఆయన తెలిపారు.

రూరల్ మండల పరిషత్ కార్యాలయానికి నూతన శోభ

- రూ. 15 లక్షలతో అభివృద్ధి పనులు
- డయాస్‌తో కూడిన సమావేశ మందిరం



సమావేశ మందిరం



కొత్త అందాలతో రూరల్ మండల పరిషత్ కార్యాలయం

విజయవాడ రూరల్: విజయవాడ నగరానికి నడిఒడ్డున ఉన్న విజయవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కొత్త అందాలను అలంకరించుకుంది. గత టీడీపీ ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి పనులకు నోచుకోకుండా కార్యాలయ భవనం పిల్లర్లు పగుళ్లతో ఇనుప చువ్వలు కనబడేవి. శ్లాబు కూడా వర్షం వస్తే కురిసే పరిస్థితితో పాటు కోతులకు నిలయంగా ఉన్న మండల పరిషత్ కార్యాలయం నేడు కొత్త అందాలను సంతరించుకుంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రూ. 15 లక్షలతో ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి సూచనల మేరకు కార్యాలయంలో పలు అభివృద్ధి పనులు జరిగాయి. మండల పరిషత్ కార్యాలయం చుట్టూ ఓపెన్‌గా ఉండటంతో కోతులు నిత్యం కార్యాలయంలోనే విన్యాసాలు చేస్తూ సిబ్బంది విధులకు ఆటంకం కల్గించేవి. మహిళా సిబ్బంది కోతుల రాకతో భయపడి తలుపులు మూసి విధులను నిర్వహించుకోవాల్సి వచ్చేది. కానీ నేడు కార్యాలయం చుట్టూ ఐరన్‌గ్రిల్ ఏర్పాటు చేయడం జరిగింది. దీంతో కోతుల బెడద లేకుండా ఉద్యోగులు ప్రశాంతంగా విధులను నిర్వహించుకుంటున్నారు. వర్షం వస్తే కురిసేశ్లాబును అభివృద్ధి చేసి కొత్తగా శ్లాబు వేసి, అన్ని గదులకు సీలింగ్ నిర్మించడం జరిగింది. పడిపోవడానికి సిద్ధంగా ఉన్న పిట్టగోడలను స్టాండర్డ్‌గా నిర్మించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోనే అతి పెద్ద సంఖ్యలో ఎంపీటీసీ సభ్యులు 40 మంది ఉన్న ఈ మండల పరిషత్ కార్యాలయంలో గత 20 సంవత్సరాలుగా సమావేశం నిర్వహించుకునేందుకు డయాస్‌లేని పరిస్థితి ఉండేది. ప్రస్తుతం డయాస్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యాంబలమ్‌ను ఏర్పాటు చేసి అందమైన వేదికను నిర్మించడం జరిగింది. రూఫ్ లైటింగ్‌తో కొత్త అందాలతో కళ కళలాడుతోంది. ప్రస్తుతం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల విస్తర్ణ అధికారి, పంచాయతీరాజ్ అసిస్టెంటు ఇంజినీర్, గృహనిర్మాణ శాఖ అధికారులకు ప్రత్యేక గదులున్నాయి. అలాగే మండల పరిషత్ కార్యాలయంలోనే జాతీయ ఉపాధి హామీ పథకం ఉద్యోగులకు మండల పరిషత్ కార్యాలయంపై భాగంలో ప్రత్యేకంగా ఒక కార్యాలయం నిర్మించడం జరిగింది.

చురుగ్గా రహదారి అభివృద్ధి పనులు



జెండా చెట్టు సెంటర్‌లో జరుగుతున్న రహదారి అభివృద్ధి పనులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు జెండా చెట్టు సెంటర్‌లోని ప్రధాన రహదారి అభివృద్ధి రెండో విడత పనులు చురుగ్గా జరుగుతున్నాయి. జిల్లా పరిషత్ నిధులు రూ. 22 లక్షలతో 20 అడుగుల వెడల్పు, 190 మీటర్ల పొడవుతో అభివృద్ధి పనులు సాగుతున్నాయి. ఇప్పటికే లెవలింగ్ పనులు పూర్తి చేసి రెండు లేయర్లు పరిచారు. ఈ సందర్భంగా మంగళవారం గ్రామ సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు మాట్లాడుతూ తొలి విడతలో ఈ రహదారిని మండల పరిషత్ నిధులు రూ. 75 లక్షలతో 540 మీటర్ల పొడవు అభివృద్ధి చేసినట్లు తెలిపారు. జెండా చెట్టు సెంటర్ నుంచి మసీదు వరకు అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. రెండో విడత పనుల్లో భాగంగా అతి త్వరలో కాంక్రీటు పనులు నిర్వహించి పూర్తి చేయనున్నట్లు వివరించారు.

పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ



పాలిసెట్ ఉచిత కోచింగ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, నాయకులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పాలిటెక్నిక్ కోర్సులో ప్రవేశానికి రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ నిర్వహించే పాలిసెట్-2024లో ఉత్తమ ర్యాంకు సాధించేందుకు ఏప్రిల్ 1వ తేదీ నుంచి తమ కళాశాలలో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్-2024 ప్రవేశ పరీక్ష ఫీజు చెల్లించిన రశీదును చూపించి ఈ నెల 31వ తేదీలోగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 1వ తేదీ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రతి రోజు శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. ఇతర వివరాలకు 94926 85021 మొబైల్ నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన పాలిసెట్ ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. ఎస్ఆర్ఆర్ కళాశాలలో మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఉచిత పాలిసెట్ కోచింగ్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రతి ఏటా విద్యార్థులకు ఉపయోగపడేలా ఉచిత కోచింగ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. సీనియర్ ఉపాధ్యాయులచే క్లాసులు నిర్వహించడంతో పాటు ఉచితంగా మెటీరియల్స్ అందజేస్తామని తెలిపారు. గత 10 ఏళ్లుగా అనేక మంది విద్యార్థులు ఉచిత కోచింగ్ తీసుకొని మంచి ఫలితాలు సాధించి ప్రభుత్వ కళాశాలలో సీటు సాధించారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర నాయకులు ఎస్కే.జాహిదా, భార్గవ, బి.మాధవ్, టి.ప్రణీత మణికంఠ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


వీరవల్లిలో కొనసాగుతున్న తిరుపతమ్మ తల్లి తిరునాళ్ల

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని తిరుపతమ్మ తిరునాళ్ల గత నాలుగు రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. గ్రామంలోని లక్ష్మీతిరుపతమ్మ, గోపయ్యస్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అర్చనలు, లలిత సహస్ర నామ పారాయణం జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం వద్ద రద్దీ ఏర్పడింది. ఆలయ ధర్మకర్త, మాజీ సర్పంచ్ నందమూరి కృష్ణప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

10 మద్యం బాటిళ్లు స్వాధీనం

ఉయ్యూరు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ఉయ్యూరు పట్టణ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. పట్టణ ఎస్ఐ గణేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పమిడిముక్కల మండలం మంటాడ గ్రామానికి చెందిన గుడిపాటి శ్రీను అక్రమంగా మద్యం విక్రయించేందుకు మద్యం బాటిళ్లను తీసుకుని వెళ్తుండగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. తనిఖీ చేయగా అతని వద్ద 10 మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయి. శ్రీనును అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆంగ్ల భాషపై పట్టు సాధించాలి



పెనమలూరు: ఆంగ్ల భాషపై పట్టు సాధిస్తే పోటీ ప్రపంచంలో రాణించగలరని ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్ ధన్‌వేల్ అన్నారు. కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో మంగళవారం మొదటి ఏడాది ఇంజినీరింగ్ విద్యార్థులకు ఆంగ్ల భాషపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ రంగంలో పోటీని తట్టుకోవాలంటే ఆంగ్ల భాష ప్రావీణ్యత చాలా అవసరమన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనం, మాట్లాడటం పట్ల ఆసక్తి చూపితే ఆంగ్ల భాషపై పట్టు సాధించగలుగుతారని వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ శ్రీలక్ష్మీబాషా, డాక్టర్ ఎ.పూర్ణచంద్రరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను బకాయి వసూలు చేయండి



పెనమలూరు: ఆస్తి పన్ను బకాయిలు సకాలంలో వసూలు చేయాలని తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. యనమలకుదురు సచివాలయం-1ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను బకాయి చాలా ఉందన్నారు. ఈ నెలాఖరు కల్లా పన్ను బకాయి ఒకేసారి చెల్లిస్తే ప్రభుత్వం వడ్డీ మాఫీ చేస్తుందని తెలిపారు. ఆస్తి పన్ను సకాలంలో చెల్లించని యజమానులకు రెడ్ నోటీసు జారీ చేస్తామని అన్నారు. మార్చి 31వ తేది నాటికి వంద శాతం పన్ను వసూలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పన్నులు సకాలంలో వసూలు చేయగలిగితేనే అభివృద్ధి పనులు చేపట్టగలమని తెలిపారు. అన్ని సచివాలయాల పరిధిలో ఎన్నికల కోడ్ విధిగా అమలు జరిగే విధంగా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రజాపాలన కోసం జగనన్నను గెలిపించాలి

మంత్రి జోగి రమేష్



తాడిగడపలో ప్రచారం చేస్తున్న మంత్రి జోగి రమేష్

పెనమలూరు: రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగాలంటే తిరిగి జగనన్నను సీఎం చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ అభ్యర్థి ఎమ్మెల్యే జోగి రమేష్ అన్నారు. తాడిగడప కాలువ కట్టపై మంగళవారం ఆయన గడప గడపకు ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రమేష్ మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేశారని అన్నారు. పాదయాత్రలో జగనన్న ఇచ్చిన హామీలు అమలు చేసి ప్రజలకు అండగా నిలిచారని తెలిపారు. రాష్ట్రంలో అమలు జరిగిన సంక్షేమ పథకాలతో నేడు ప్రజలు సంతోషంగా ఉన్నారని వెల్లడించారు. జగనన్న పాలనలో పేదలు ఆత్మవిశ్వాసంతో జీవించగలుగుతున్నారని పేర్కొన్నారు.

చంద్రబాబును నమ్మొద్దు..

ప్రజలకు ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి వారిని మోసం చేసే చంద్రబాబును నమ్మొద్దని మంత్రి జోగి రమేష్ అన్నారు. చంద్రబాబు 14 ఏళ్ల సీఎంగా చేసిన కాలంలో ఏనాడు పేదల గురించి ఆలోచించలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు న్యాయం చేయలేదని ఆరోపించారు. చంద్రబాబు కూటమితో ఇప్పుడు మరల ప్రజలను మోసం చేయడానికి వస్తున్నాడని, ప్రజలు అప్రమత్తంగా ఉండి కూటమిని తరిమికొట్టాలని అన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించే విధంగా ప్రజలు మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, తాడిగడప మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్, నేతలు జిన్నా, కాకి శ్రీనివాసరావు, పి.సాంబయ్య, శ్రీకాంత్‌రెడ్డి, ముజీబ్, పీజే కిషోర్, ఖాదర్‌బాషా, రామాంజనేయులు, వరప్రసాద్, అద్దేపల్లి చందు, కే క్రిష్టోఫర్, ఎల్లారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే సంక్షేమం



మేం సిద్ధం-మా బూత్ సిద్ధం కార్యక్రమంలో వెంకటసుభాష్

కంకిపాడు: వైఎస్సార్ సీపీతోనే సంక్షేమం ముడిపడి ఉందని ఆ పార్టీ ఈడుపుగల్లు నాయకుడు పర్వతనేని వెంకటసుభాష్ అన్నారు. ఈడుపుగల్లు గ్రామంలో మంగళవారం 'మేం సిద్ధం -మా బూత్ సిద్ధం' కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీ, కొత్తూరు మసీదు సెంటరు, ఎస్‌జీఎస్ కల్యాణ మండపం ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో సంక్షేమ ప్రభుత్వం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలవాలని, పెనమలూరు ఎమ్మెల్యేగా జోగి రమేష్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చోరగుడి శ్రీకాంత్, నాగదేశి రవి, బి.మల్లేష్, జంగం బాలస్వామి, బి.బెనర్జీ, పోసిన కృష్ణ, షేక్ బాదుల్లా, షేక్ మౌలాలీ, షేక్ బాషా, శివనాగులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు విధిగా పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రాజు

పెనమలూరు: ఎన్నికల నిబంధనలు ప్రతీ రాజకీయ పార్టీ, అభ్యర్థులు విధిగా పాటించాలని పెనమలూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ డి.రాజు సూచించారు. పెనమలూరు తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ రాజు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతీ ఒక్క అభ్యర్థి నిబంధనలకు లోబడి ప్రచారంలో పాల్గొనాలని సూచించారు. ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షుడి నుంచి లెటర్ తీసుకొని అనుమతులకు దరఖాస్తు చేయాలని అన్నారు. ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించాలంటే కూడా అనుమతులు తప్పనిసరన్నారు. 85 సంవత్సరాలు నిండిన వృద్ధులు, అంగవైకల్యం కలిగిన వారు ఓటు ఇంటి వద్దే వేస్తారా లేక పోలింగ్ బూత్‌కు వచ్చి వేస్తారా అనే విషయమై సర్వే చేస్తున్నామని తెలిపారు. ఇంటి వద్దే ఓటు వేసేవారు సంబంధిత ఫారం నింపి తమకు అందజేయాలని సూచించారు. ఎన్నికలు ముగిసే వరకు రాజకీయ పార్టీల నేతలు తమకు సహకరించాలని పేర్కొన్నారు. సమావేశంలో తహసీల్దార్ ప్రసాద్, డీటీ భవాని, వివిధ పార్టీల నేతలు అన్నే వేణుగోపాల కృష్ణమూర్తి, కిలారు వెంకటరత్నం, ఉప్పాడ త్రిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ బయోలాజికల్ పరీక్షకు 152 మంది గైర్హాజరు

గన్నవరం: మండలంలోని ఎనిమిది పరీక్ష కేంద్రాల్లో మంగళవారం జరిగిన పదో తరగతి బయోలాజికల్ సైన్స్ పరీక్షకు 152 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ కే రవికుమార్ తెలిపారు. ఈ పరీక్షకు మొత్తం 1,403 మంది విద్యార్థులకుగాను 1,251 మంది హాజరైనట్లు చెప్పారు. విద్యాహక్కు చట్టం-2009 ప్రకారం ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతి ఉచిత ప్రవేశాల కోసం దరఖాస్తు గడువు ఈ నెల 31వ తేది వరకు పెంచినట్లు చెప్పారు. ఐదేళ్లు నిండిన పిల్లలు ఉచిత ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు గ్రామ సచివాలయాలు, మీసేవా కేంద్రాలను సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 18004258599 టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

క్రైమ్, కామెడీ చిత్రం.. భరతనాట్యం



భరతనాట్యం చిత్ర యూనిట్ సభ్యులు సూర్యతేజ, పాయల్ సరఫ్ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): క్రైమ్, కామెడీ ఎలిమెంట్స్‌తో రూపొందించిన భరతనాట్యం సినిమా ఏప్రిల్ 5వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుందని ఆ చిత్ర కథానాయకుడు సూర్యతేజ అన్నారు. విజయవాడలోని ఓ హోటల్‌లో మంగళవారం ఆ చిత్ర యూనిట్ సభ్యులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హీరో సూర్యతేజ మాట్లాడుతూ ఈ చిత్రానికి తానే కథ రాశానని, ఆ సమయంలో తాను హీరోగా నటిస్తానని అనుకోలేదన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో నటించాల్సి వచ్చిందన్నారు. సినిమాలోని ప్రతి సన్నివేశం ప్రేక్షకుడిని ఉత్కంఠపరిచేలా ఉంటుందన్నారు. నిర్మాత పాయల్ సరఫ్ మాట్లాడుతూ ఇది నిర్మాతగా తనకు తొలి చిత్రం అని, ప్రమోషన్ కార్యక్రమం విజయవాడ నుంచి ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. డైరెక్టర్ కేఆర్ మహేంద్ర మాట్లాడుతూ తన తొలి సినిమా దొరసాని హిట్ అయిందని, రెండో సినిమా భరతనాట్యంను కూడా ప్రేక్షకులు ఆదరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

త్రిశక్తి పీఠంలో 9న అమ్మవారికి గాజులతో అలంకరణ

కృష్ణలంక(విజయవాడతూర్పు): క్రోధి నామ సంవత్సరం ఉగాది సందర్భంగా ఏప్రిల్ 9వ తేదీన బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో కాళీమాత అమ్మవారికి గాజులతో విశేషాలంకరణ జరుగుతుందని ఆలయ కమిటీ కార్యదర్శి కె.జగదీష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు తమ శక్తి కొద్ది గాజులను ఏప్రిల్ 3వ తేదీ లోగా దేవస్థానంలో అందజేయాలని కోరారు. సాయంత్రం 6.20 గంటలకు బ్రహ్మశ్రీ పుచ్చా సూర్యప్రకాశ్ శాస్త్రిచే ఉగాది పంచాంగ శ్రవణం ఉంటుందన్నారు. అలాగే 9 నుంచి 17వ తేదీ వరకు వసంత నవరాత్రుల సందర్భంగా మహాకాళీ, మహాలక్ష్మీ, మహాసరస్వతీ అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఉదయం 7.30 గంటలకు అభిషేకం, పుష్పార్చన నిర్వహిస్తామని చెప్పారు. ఆసక్తి గలవారు దేవస్థానం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. 17వ తేదీన శ్రీరామనవమి సందర్భంగా సీతారామస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరుగుతుందని తెలిపారు.